నమస్తే తెలంగాణ

ఆదిలాబాద్ - నిర్మల్

5 | నిజామాబాద్ సోమవారం 26 మే 2025 | ADILABAD NIRMAL


## నిర్మల్ జిల్లాలో 236.6 మిల్లి మీటర్ల వర్షపాతం



నిర్మల్ అర్బన్, మే 25 : జిల్లా వ్యాప్తంగా 236.6 మి. మీటర్ల వర్షపాతం నమోదైందని వాతావరణ శాఖ అధికారులు ఆదివారం తెలిపారు. కుభీర్ 7.2 మి.మీ, తానూర్ 19.6, బాసర 22.4, ముథోల్ 18.0, భైంసా 5.4, కుంటాల 9.4, నర్సాపూర్(జీ) 19.2, లోకేశ్వరం 6.2, దిలావర్‌పూర్ 12.2, సారంగాపూర్ 25.2, నిర్మల్ 5.2, నిర్మల్ రూరల్ 10.6, సోన్, లక్ష్మణ చాంద 16.2, మామడ 14.0, పెంబి 15.4, ఖానాపూర్ 14.4, కడెం 6.2, దస్తూరబాద్ 0.4, మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. ఇది సగటున జిల్లా వ్యాప్తంగా 12.5 మిల్లీ మీటర్లు నమోదైంది.

## బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక

తానూర్, మే, 25 : పడకంటి రమాదేవి ఆధ్వర్యంలో వడ్‌గావ్‌కు చెందిన వివిధ పార్టీల కార్యకర్తలు 30 మంది బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ.. గతంలో తెలంగాణ ప్రభుత్వం చేసిన పనులకు ఆకర్షితులై బీఆర్‌ఎస్‌లో చేరేందుకు కార్యకర్తలు వలస బాట పడుతున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 420 హమీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిందన్నారు. తరువాత వచ్చేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, బాలాజీ, పాల్గొన్నారు.



బీఆర్‌ఎస్ పార్టీలో చేరిన వివిధ పార్టీల కార్యకర్తలతో రమాదేవి

# జొన్నల కొనుగోళ్లు వేగవంతం

- ఈ నెల 31 వరకు పూర్తి
- ముందస్తు వర్షాల నేపథ్యంలో అధికారుల చర్యలు



ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో విక్రయానికి వచ్చిన జొన్నలు

ఆదిలాబాద్, మే 25 (నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లాలో వానకాలం ప్రారంభానికి ముందే వర్షాలు పడుతుండడంతో అధికారులు జొన్నల కొనుగోళ్లను వేగవంతం చేశారు. మరో వారం రోజుల్లో రైతులు జిల్లాలో వ్యవసాయ పనులు ప్రారంభించనుండగా పంటను విక్రయానికి తీసుకుపోతున్నారు. జిల్లా కేంద్రంలోని ఆదిలాబాద్ మార్కెట్ యార్డుతోపాటు ఇతర మార్కెట్ యార్డుల్లో ఆదివారం పంట కొనుగోళ్లు జరిగాయి. యాసంగిలో రైతులు సాగు చేసిన జొన్న పంట దిగుబడులు ఎకరానికి 15 క్వింటాళ్ల వరకు వచ్చాయి. మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో 10 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి ప్రాథమిక సహకార సంఘాల ద్వారా పంటను సేకరిస్తున్నారు. అధిక దిగుబడుల కారణంగా మార్కెట్ యార్డులతోపాటు కొనుగోలు కేంద్రాల్లో రైతులు భారీగా జొన్నలను విక్రయించడానికి తీసుకొస్తున్నారు. ఆదిలాబాద్ మార్కెట్ యార్డుకు వివిధ మండలాల నుంచి పంట ఎక్కువగా వస్తుండడంతో కొత్తగా సాత్నాల మండలంలోని మేడిగూడ, భోరజ్ మండల కేంద్రాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులు వద్ద నుంచి పంటను సేకరిస్తున్నారు.



ఆదిలాబాద్ మార్కెట్‌యార్డులో జొన్నలను పరిశీలిస్తున్న కొనుగోలు కేంద్ర ఇన్‌చార్జి పండరి

### ఈ నెల 31 వరకు కొనుగోళ్లు

యాసంగిలో రైతులు సాగు చేసిన జొన్నలను ఈ నెల 31వ తేదీ వరకు కొనుగోలు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధర క్వింటాలుకు రూ.3371తో కొనుగోలు చేస్తున్నారు. ప్రైవేటు వ్యాపారులు క్వింటాలుకు రూ.2600 చెల్లిస్తుండడంతో రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు పంటను తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. వర్షాల నేపథ్యంలో పంటలో తేమ శాతాన్ని పరిశీలించి కొనుగోలు చేస్తున్నారు. ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో ఇప్పటి వరకు ఒక లక్ష క్వింటాళ్ల జొన్నలను కొనుగోలు చేశారు. మరో 25 వేల క్వింటాళ్ల పంట విక్రయానికి వచ్చే అవకాశం ఉందని కొనుగోలు కేంద్రాల సిబ్బంది తెలిపారు. రైతులు తేమ, చెత్త, చెదారం లేకుండా జొన్నలను తీసుకొస్తే ఎలాంటి ఇబ్బందులు ఉండవని, నిబంధనల మేరకు పంటను మార్కెట్ యార్డుకు తీసుకురావాలని అధికారులు సూచిస్తున్నారు.




బాబాపూర్‌లో బురదగా మారిన కొనుగోలు కేంద్రం

# ఇదేం సర్కారు

## కనీసం ధాన్యం కూడా కొంటలేదు

- కేంద్రానికి తీసుకొచ్చి పక్షం రోజులైతంది
- అరిగోస పడుతున్నా పట్టించుకుంట లేదు
- కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న రైతులు

లక్ష్మణచాంద, మే 25 : వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో బాబాపూర్, మల్లాపూర్, పార్‌పెల్లి గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన ధాన్యం తడిచి మొలకలు వస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం ప్రతి గింజను కొనుగోలు చేస్తామని ప్రకటనలు చేస్తుండడంతో రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదేం సర్కారని మండిపడుతున్నారు. వర్షపు నీటితో కొనుగోలు కేంద్రాలు బురదగా మారడంతో ఆరబెట్టే పరిస్థితి లేదు. తడిచిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.



బాబాపూర్ కొనుగోలు కేంద్రంలో మొలకెత్తిన వరి ధాన్యాన్ని చూపుతున్న రైతులు



### ధాన్యాన్ని కొనుగోలు చేయాలి..

వరుసగా కురుస్తున్న వర్షాలకు ఎనిమిది ట్రాక్టర్ల ధాన్యం తడిచింది. తడవకుండా చేసిన ప్రయాత్నాలన్నీ వృథాగా మారినవి. ధాన్యం తడిచిపోవడంతో కింది భాగంలోని ధాన్యం మొలకలు వస్తున్నాయి. తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి ఎవరూ రావడం లేదు. ప్రభుత్వం తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని చెపుతున్నది. కానీ.. ఎక్కడా కొనుగోలు చేయడం లేదు. వెంటనే తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేసి ఆదుకోవాలి.

బొట్టు శ్రీనివాస్, రైతు, బాబాపూర్, లక్ష్మణచాంద మండలం

# ప్రశాంతంగా రాత పరీక్ష

ఎదులాపురం, మే 25 : గ్రామ పాలన అధికారుల నియామకం కోసం ఆదివారం నిర్వహించిన రాత పరీక్ష ప్రశాంతంగా సాగింది. పట్టణంలోని నలంద డిగ్రీ కళాశాలలో కేంద్రాన్ని ఏర్పాటు చేయగా.. పరీక్ష నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. 83 మంది రాత పరీక్షకు హాజరు కానుండగా.. వారికి ఇబ్బంది తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. కలెక్టర్ రాజర్షి షా కేంద్రాన్ని సందర్శించారు. పరీక్ష తీరును పరిశీలించి సిబ్బందికి అవసరమైన సూచనలు చేశారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని అభ్యర్థులు ఇబ్బంది కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేపట్టారు.

### నిర్మల్‌లో ప్రశాంతం

నిర్మల్ అర్బన్, మే 25 : నిర్మల్ జిల్లా కేంద్రంలోని చాణిక్య పాఠశాలలో ఆదివారం గ్రామ పాలన అధికారుల నియామక పరీక్ష ప్రశాంతంగా కొనసాగింది. 105 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా.. 96 మంది హాజరయ్యారు. ఆరుగురు గైర్హాజరయ్యారు.



ఆదిలాబాద్‌లో కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

# ప్రైవేటు పనులకు ప్రభుత్వ ట్యాంకర్




గ్రామ పంచాయతీ వాటర్ ట్యాంకర్‌ను ఇంటి అవసరాలకు వాడుకుంటున్న దృశ్యం

*పల్లె ప్రగతిలో భాగంగా గ్రామాల్లో పరిశుభ్రత, పచ్చదనం పెంపొందించడానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు ట్రాక్టర్లు, ట్యాంకర్లను పంపిణీ చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం పంచాయతీలను నిర్లక్ష్యం చేయడంతో వీటి నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. తాంసి మండలంలోని ఘోట్కూరీ గ్రామ పంచాయతీ ట్యాంకర్ ఆదిలాబాద్ పట్టణంలో కనిపించింది. బృందావన్ కాలనీలో నిర్మిస్తున్న ఇంటికి అవసరమైన నీటిని సరఫరా చేయడానికి ట్యాంకర్‌ను వినియోగిస్తున్నారు. ట్యాంకర్ ఆదిలాబాద్‌లో ప్రైవేటు పనులకు వినియోగిస్తున్నారని ఘోట్కూరి పంచాయతీ కార్యదర్శి రాజిరెడ్డిని అడుగగా.. తనకు తెలియకుండా కొందరు గ్రామస్తులు తీసుకెళ్లారని తెలిపాడు.*

*- ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్*

# ప్రియుడి ఇంటి ఎదుట బైఠాయింపు

బోథ్, మే 25 : ప్రేమ పేరిట మోసం చేసి, పెళ్లికి నిరాకరిస్తున్నాడని ప్రియుడి ఇంటి ఎదుట ప్రియురాలు బైఠాయించిన ఘటన సొనాల మండలంలో చోటు చేసుకుంది. సొనాలకు చెందిన ఓ యువకుడు అదే గ్రామానికి చెందిన ఓ యువతి కొన్నేండ్లుగా ప్రేమించుకుంటున్నారు. పెళ్లి చేసుకుంటానని యువతిని సదరు యువకుడు కొద్ది రోజులుగా నమ్మిస్తూ వస్తున్నాడు. సదరు యువకుడు మరో అమ్మాయితో పెళ్లి నిశ్చయం చేసుకుని వివాహానికి సిద్ధమయ్యాడు. ఇంట్లో పెళ్లి పనులు నడుస్తున్నాయి. ఆదివారం సదరు యువతి యువకుడి ఇంటి ఎదుట తనను పెళ్లి చేసుకోవాలని బైఠాయించింది. యువకుడి కుటుంబ సభ్యులు అవాక్కయ్యారు. ప్రియుడే ఇంటికి రమ్మన్నాడని తనను పెళ్లి చేసుకుంటానన్నాడని యువతి వాపోయింది. పోలీసులకు సమాచారం అందడంతో సిబ్బంది సదరు యువతిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. యువకుడితోపాటు కుటుంబ సభ్యులపై యువతి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సమాచారం. బోథ్ సీఐ వెంకటేశ్వర్‌రావు, ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ ఇరువురిని పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు.

# వక్ఫ్ బిల్లును ఉపసంహరించుకోవాలి

## ఎన్టీఆర్ చౌక్‌లో మానవహారంగా ఏర్పడి నిరసన

ఎదులాపురం, మే 25 : కేంద్రం తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని ముఫ్తీ సర్దార్ రెహమాని ఖాస్మీ డిమాండ్ చేశారు. వక్ఫ్ బిల్లును రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆల్ ఇండియా పిలుపు మేరకు ఆదివారం ఎంఐఎం పట్టణ అధ్యక్షుడు నజీర్ అహ్మద్ ఆధ్వర్యంలో ఆదిలాబాద్‌లోని ఎన్టీఆర్ చౌరస్తా వద్ద భారీ మానవహారం చేపట్టారు. వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు అఫ్సర్, సిరాజ్ ఖాద్రీ, ఆరిఫ్, మహమ్మద్ రోహిత్, షానవాజ్, సలీం పాల్గొన్నారు.




ఎంఐఎం ఆధ్వర్యంలో మానవహారంగా ఏర్పడి నిరసన తెలుపుతున్న నాయకులు, యువకులు



నకిలీ విత్తనాలు నమ్ముతున్న వ్యక్తిని అరెస్ట్ చేసిన జైనథ్ సీఐ

# నకిలీ విత్తన ప్యాకెట్లు స్వాధీనం

## ఇద్దరిపై కేసు.. ఒకరి అరెస్ట్

బేల, మే 25 : అమాయక ఆదివాసీ రైతులను ప్రజలను మోసం చేస్తూ నకిలీ విత్తనాలను అమ్ముతున్న ఇద్దరిపై కేసు నమోదు చేయగా.. ఒకరి అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ జీవన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం వివరాలను వెల్లడించారు. మండల కేంద్రంలోని సిర్సన్న గ్రామంలో అమాయక ఆదివాసీ రైతులను ప్రజలను మోసం చేస్తూ నకిలీ విత్తనాలను అమ్ముతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు దాడి చేశామని తెలిపారు. ఇందులో సిర్సన్న గ్రామానికి చెందిన ఎండీ కుర్షిద్ వద్ద ఐదు కిలోల లూజ్ నకిలీ విత్తనాలు, 23 నకిలీ విత్తన ప్యాకెట్లు లభించినట్లు తెలిపారు. అతడిని విచారించగా.. తన బావ మహారాష్ట్రలోని మహమూద్ వద్ద 10 కిలోల లూజు నకిలీ విత్తనాలు, 26 ప్యాకెట్లను కొనుగోలు చేసినట్లు ఒప్పుకున్నాడు. బాది గ్రామంలో జలపతికి ఐదు కిలోల విత్తనాలను రూ.13 వేలకు.. జుగ్నకే శంభుకు మూడు ప్యాకెట్లను రూ.1200లకు విక్రయించినట్లు తెలిపాడు. ఇద్దరిపై బేల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశామని తెలిపారు. ప్రజలు ఎలాంటి సమాచారం ఉన్న టాస్క్‌ఫోర్స్ సీఐ 8712659965 నంబర్‌కు సంప్రదించాలని తెలిపారు.

### నకిలీ విత్తనాలపై ఉక్కుపాదం

#### ఉట్నూర్ ఏఎస్పీ కాజల్‌సింగ్

ఇచ్చోడ, మే 25 : ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాల ద్వారా నకిలీ విత్తనాలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ సింగ్ తెలిపారు. ఇచ్చోడ ఏవో రమేశ్ ఫిర్యాదు మేరకు మండలంలో దాడులు నిర్వహించి 39 నకిలీ విత్తన ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఇస్లాంనగర్‌కు చెందిన జాదవ్ గజానంద్, కోకస్ మన్నూర్ గ్రామానికి చెందిన కంది శివకుమార్, కొతపల్లి రవీందర్, ముక్రా(బీ) గ్రామానికి చెందిన ఆదవ్ రవికాంత్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

# విద్యుత్ షాక్‌తో ఒకరి మృతి

ముథోల్, మే 25 : ముథోల్‌లోని ఓ దాబాలో విద్యుత్ షాక్‌తో మహమూద్ మృతి చెందినట్లు సీఐ మల్లేశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కూలర్‌కు ప్లగ్ పెట్టే సమయంలో విద్యుత్ షాక్ తగిలి మృతి చెందాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

### వాహనం ఢీ కొని ఒకరు..

తలమడుగు, మే 25 : మండలంలోని సుంకిడి వద్ద కేటీసీ వాహనం ఢీకొని ఒకరు మృతి చెందిన ఘటన ఆదివారం చోటు చేసుకున్నది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్‌లోని ధోబీ కాలనీకి చెందిన శంకర్(42) ఆదివారం తన అత్త గారి గ్రామమైన కొత్తూరుకు వచ్చి తిరిగి ఆదిలాబాద్‌కు వెళ్తున్నది. ఈ సమయంలో సుంకిడి వద్ద స్కూటీ ఆపుకుని రోడ్డుపై నిలబడి ఉన్నాడు. మహారాష్ట్ర నుంచి ఆదిలాబాద్ వైపు అతివేగంగా వెళ్తున్న కేటీసీ వాహనం ఢీకొని శంకర్ అక్కడికక్కడే మృతి చెందాడు. కేటీసీ వాహనాలు తరచూ అతివేగంగా వెళ్లడం ద్వారా ప్రమాదాలు జరుగుతున్న ఎవరు పట్టించుకోలేదని సుంకిడి, కొత్తూరు గ్రామస్తులు అంతర్రాష్ట్ర రహదారిపై రాస్తారోకో చేశారు. ఘటనా స్థలానికి ఆదిలాబాద్ సీఐ ఫణిందర్, ఎస్ఐ రాధిక చేరుకుని బాధితునికి న్యాయం చేసేలా చూస్తామని గ్రామస్తులకు హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు. శంకర్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# పలు దుకాణాల్లో చోరీ

నిర్మల్ అర్బన్, మే 25 : నిర్మల్‌లో శనివారం అర్ధరాత్రి దొంగలు రెచ్చిపోయారు. ఈద్గాం ప్రాంతంలోని మెడికల్ దుకాణం, బస్టాండ్ ప్రాంతంలోని ఓ దుకాణం షట్టర్ల తాళాలు పగలగొట్టి రూ.60 వేల నగదును గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఆదివారం ఉదయం తమ దుకాణాలకు వచ్చిన యజమానులు దొంగతనం జరిగిన విషయాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందజేశారు. అనంతరం పట్టణ పోలీసులు ఘటన స్థలాలను పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



నిర్మల్‌అర్బన్ : షట్టర్ ధ్వంసం చేసిన దొంగలు

### ముథోల్ వైన్స్‌లో..

ముథోల్, మే 25 : ముథోల్‌లోని రాజరాజేశ్వర వైన్స్‌లో శనివారం అర్ధరాత్రి చోరీ జరిగినట్లు నిర్వాహకులు తెలిపారు. వైన్స్ పక్కన రేకులకు ఉన్న స్క్రూలను తొలగించి రూ. 2.50 లక్షల మద్యంతోపాటు రూ.19 వేల నగదును ఎత్తుకెళ్లారు. చోరీకి గురైన వైన్స్‌ని స్థానిక సీఐ మల్లేశ్ పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

# ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ లైసెన్స్ తీసుకోవాలి



రొట్టె పిండిని పరిశీలిస్తున్న డాక్టర్ శ్రీధర్

బోథ్, మే 25: హోటల్ యజమానులు, ఆహార విక్రయ వ్యాపారస్తులు ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ లైసెన్స్ తీసుకోవాలని జిల్లా ఆహార భద్రతా అధికారి డాక్టర్ శ్రీధర్ మిట్‌పెల్లివార్ ఆదేశించారు. ఆదివారం ఆదిలాబాద్ జిల్లా సొనాలలోని హోటళ్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎటువంటి లైసెన్స్ లేకుండా వ్యాపారాలు చేసినట్లయితే అండర్ సెక్షన్ 31 సబ్‌సెక్షన్(1) లేదా ఎఫ్‌ఎస్‌ఎస్ ఆక్ట్ 2006 ప్రకారం రూ.5 లక్షల వరకు జరిమానా పడే అవకాశం ఉంటుందన్నారు. లైసెన్స్ లేకుండా ఎవరు కూడా వ్యాపారం చేయవద్దని పేర్కొన్నారు. నిషేధిత పదార్థాలను వాడొద్దని, పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఆయన వెంట సొనాల పీహెచ్‌సీ డాక్టర్ నవీన్ రెడ్డి, ఎంపీవో మహేందర్ రెడ్డి ఉన్నారు.

### డీసెట్ పరీక్ష

ఎదులాపురం, మే 25 : డీఎడ్ కోర్సులో ప్రవేశానికి ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా సాగింది. పట్టణంలోని నలంద డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో అభ్యర్థులకు అవసరమైన పూర్తి ఏర్పాట్లు చేశారు. ఉదయం, మధ్యాహ్నం సెషన్లలో 100 మంది చొప్పున అభ్యర్థులు పరీక్ష రాసేలా ఏర్పాట్లు చేశారు.